సాక్షి
నిర్మల్
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023



కోతిదేవుడి జాతరకు ముస్తాబు
ఒక కోతి మరణిస్తే గ్రామస్తులంతా కలిసి సమాధి నిర్మించారు. ఆ తర్వాత ధర్మారం-పీచర గ్రామాల మధ్య ఆలయం నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. 8లో▸




గురుకులం పిలుస్తోంది.. 8లో▸
గురుకులాల్లో 2024-25 విద్యా సంవత్సరం లో ఐదో తరగతిలో ప్రవేశానికి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నోటిఫికేషన్ విడుదల చేశారు.

గరిష్ఠం/కనిష్ఠం
26.3 /14.5

వాతావరణం
ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. తుపాను ప్రభావంతో చలి తీవ్రత పెరుగుతుంది. చల్లగాలులు వీస్తాయి.

ఎంపీపై ఫోకస్

- సమాయత్తమవుతున్న బీజేపీ
- ఇప్పటికే నిర్మల్‌లో సమావేశం
- హాజరైన ఇన్‌చార్జి సునీల్‌బన్సల్
- ఇన్‌చార్జిని ప్రకటించిన కాంగ్రెస్
- మంత్రి సీతక్కకు 'ఆదిలాబాద్' బాధ్యతలు



కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల

రాష్ట్ర మంత్రి సీతక్క

నిర్మల్: అసెంబ్లీ పోరు ముగియడంతో రానున్న పార్లమెంట్ ఎన్నికలపై పార్టీలు ఇప్పటి నుంచే దృష్టి సారించాయి. ఇందులో ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ ముందంజలో ఉన్నాయి. బీజేపీ రాష్ట్రనేతలు ఆదివారం నిర్మల్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాధ్యులతో భేటీ అయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంపీ స్థానాన్ని నిలబెట్టుకోవడంతో పాటు మెజార్టీని పెంచుకునేలా సమాయత్తమవుతోంది. మరోవైపు రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ సైతం పార్లమెంట్ పోరుకు సిద్ధమవుతోంది. ఎలాగైనా ఈసారి గెలవాలన్న లక్ష్యంతో వెళ్తోంది. ఈ మేరకు సోమవారం పార్లమెంట్ ఇన్‌చార్జీలను ప్రకటించింది. ఆదిలాబాద్ స్థానానికి ముందుగా డెప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను అనుకున్నప్పటికీ మంత్రి సీతక్కకు బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. ఇటీవల రాష్ట్రంలో ఓటమిని మూటగట్టుకున్న బీఆర్‌ఎస్ నుంచి ఎంపీ ఎన్నికలపై ఇప్పటి వరకు ఎలాంటి కదలిక కనిపించడం లేదు.

బీజేపీ దూకుడు..

ఆదిలాబాద్ సిట్టింగ్ స్థానం కావడంతో మళ్లీ నిలబెట్టుకోవాలని బీజేపీ భావిస్తోంది. ఈమేరకు మరింత బలంగా పనిచేయాలని, మెజార్టీ గణనీయంగా పెంచుకోవాలని శ్రేణులను సమాయత్తం చేస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మళ్లీ గెలవాలని దూకుడుగా వెళ్తోంది. ఇందులో భాగంగా తొలి సమావేశాన్ని ఆదివారం నిర్మల్‌లో నిర్వహించారు. బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి అయ్యన్నగారి భూమయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్‌బన్సల్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఇటీవల గెలిచిన నలుగురు ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడు, ప్రధాన నేతలు పాల్గొన్నారు. ఇందులో ఆదిలాబాద్ ఎంపీ స్థానాన్ని ఎలా నిలబెట్టుకోవాలనే అంశంపై చర్చించారు. స్థానిక పరిస్థితులు, రాజకీయాలపై సునీల్‌బన్సల్ ఆరా తీశారు. మరోవైపు పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న కేంద్రమంత్రి పురుషోత్తంరూపాల సైతం ఎప్పటికప్పుడు నేతలతో మాట్లాడుతున్నారు.

'నాలుగు' గెలువడంతో..

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో మిగితా పార్టీలతో పోలిస్తే బీజేపీ బలంగా కనిపిస్తోంది. ఇప్పటికే సిట్టింగ్ స్థానం కావడంతో పాటు ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఈ ఎంపీ నియోజకవర్గం పరిధిలోనే నలుగురు ఎమ్మెల్యేలుగా గెలుపొందడం ఇందుకు కారణం. సిర్పూర్, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్ ముధోల్ ఈ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోకి వస్తాయి. ఇందులో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో నిర్మల్‌లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ముధోల్‌లో రామారావుపటేల్, ఆదిలాబాద్‌లో పాయల్ శంకర్, సిర్పూర్‌లో పాల్వాయి హరీశ్‌రావు బీజేపీ నుంచి గెలుపొందారు. బోథ్‌లో బీఆర్‌ఎస్ నుంచి అనిల్‌జాదవ్, ఖానాపూర్‌లో కాంగ్రెస్ నుంచి వెడ్మ బొజ్జుపటేల్, ఆసిఫాబాద్‌లో బీఆర్‌ఎస్ నుంచి కోవ లక్ష్మి గెలిచారు. బీజేపీ ఓడినప్పటికీ ఈ మూడు స్థానాల్లోనూ గట్టి పోటీనే ఇచ్చింది.

హస్తం ఆశలు..

గతంలో ఐదుసార్లు ఎంపీ స్థానాన్ని కైవసం చేసుకున్న కాంగ్రెస్ మరోసారి తమ సత్తా చాటేందుకు ఉవ్విళ్లూరుతోంది. గత ఎన్నికల్లో కనీసం పోటీ ఇవ్వలేని పార్టీ ఈసారి రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో తమకు గెలుపు దక్కుతుందని భావిస్తోంది. ఇందుకోసం ఇప్పటి నుంచే పార్టీ ప్రణాళికలు రచిస్తోంది. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఒక్క ఖానాపూర్ ఎమ్మెల్యే స్థానాన్ని మాత్రమే కాంగ్రెస్ దక్కించుకోగలిగింది. ఈస్థానం నిర్మల్‌తో పాటు ఆదిలాబాద్ జిల్లా పరిధిలోనూ విస్తరించి ఉండటంతో తమ ప్రభావం రెండు ప్రధాన జిల్లాలపై చూపగలమని, ఇక్కడ గెలిచిన బొజ్జుపటేల్ ఆదివాసీ కావడంతో ఆసిఫాబాద్ జిల్లాలోనూ ఎంపీ ఎన్నికల్లో ప్రభావం చూపుతామని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు.

స్తబ్దుగా బీఆర్‌ఎస్..

అసెంబ్లీ పోరులో ఓటమిని మూటగట్టుకున్న బీఆర్‌ఎస్ ఎంపీ ఎన్నికలపై ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనలు చేయడం లేదు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో బోథ్, ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానాలను దక్కించుకున్నప్పటికీ సిట్టింగ్ స్థానాలైన ఆదిలాబాద్, సిర్పూర్, ఖానాపూర్, నిర్మల్, ముధోల్ ఈ ఐదింటినీ కోల్పోయింది. గత ఎంపీ ఎన్నికల్లోనూ కారు ఓడిపోయింది. మరోవైపు బీఆర్‌ఎస్ నేతలు మాత్రం తమ పార్టీ త్వరలోనే పార్లమెంట్ పోరుకు సిద్ధమవుతుందని, ఈసారి తప్పకుండా గెలుస్తామని చెబుతున్నారు.

న్యూస్‌రీల్

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


చెక్కు అందజేస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: స్వయం సహాయక సంఘాల సభ్యులు ప్రభుత్వం, బ్యాంకులు అందజేస్తున్న రుణాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం ఆర్కే కన్వెన్షన్ హాల్‌లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా ఎస్‌హెచ్‌జీ లోన్ మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. 110 స్వయం సహాయక సంఘాలకు రూ.12 కోట్ల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి మెగా లోన్‌మేళా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం శంకర్ హిమ్రాన్, ఏజీఎం శివ కోటయ్య, డీఆర్డీవో విజయలక్ష్మి, లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్


కలెక్టర్‌తో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్‌చైన్‌గేట్: నూతన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్ సోమవారం సమీకృత కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ప్రజా ఫిర్యాదుల విభాగంలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. జిల్లా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఉపాధి హామీలో కూలీలను పెంచాలి


కూలీలతో మాట్లాడుతున్న విజయలక్ష్మి

లక్ష్మణచాంద: ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచాలని డీఆర్డీవో విజయలక్ష్మి అధికారులకు సూచించారు. సోమవారం నర్సాపూర్‌లో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ కూలీకి పని కల్పించాలన్నారు. అనంతరం గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్‌పాం తోటను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గణేశ్, సర్పంచ్ లలిత, ఏపీవో ప్రమీల, తదితరులు పాల్గొన్నారు.

'ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆదుకోవాలి'


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి తొలగించబడిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఆదుకోవాలని సోమవారం డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరి రావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా మా సేవలు వినియోగించుకుని విధుల నుంచి తొలగించడంతో మాకుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. శ్రీహరిరావు సానుకూలంగా స్పందించి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎంబడి రాకేష్, నిర్మల్ జిల్లా గృహనిర్మాణ శాఖ పొరుగు సేవల సంఘం నాయకులు రవి, రాకేష్, ఆర్.నరేందర్, ఎల్.నరేందర్, సిరాజ్ బేగ్, నాకిడి భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహం అడ్డుకున్న అధికారులు

మామడ: మండలంలోని కమల్‌కోట్ గ్రామానికి చెందిన బాలికకు నిర్మల్‌కు చెందిన యువకుడితో వివాహం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని 1098 ద్వారా సమాచారం రావడంతో ఐసీడీఎస్ అధికారులు సోమవారం గ్రామానికి వెళ్లి పెళ్లి ఏర్పాట్లు నిలిపి వేయించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల సూచించారు. బాలిక తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచకుండా సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 27 దరఖాస్తులు వచ్చాయి. ముధోల్ మండలం మచ్కల్‌కు చెందిన దివ్యాంగుడు నాగారావు తనకు ఉద్యోగం ఇప్పించి ఆదుకోవాలని కోరాడు. తెలంగాణ రాష్ట్రంలో భర్తీ చేసిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నోటిఫికేషన్‌లో భాగంగా సెకండ్ మెరిట్ లిస్టులో సెలెక్ట్ అయ్యానని, దీనికి సంబంధించి హైకోర్టులో కేసు కొనసాగగా ఉద్యోగంలోకి తీసుకోవాలని తీర్పునిచ్చినట్లు తెలిపాడు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ పరిసరాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో కనీస వసతులు కల్పించాలని లబ్ధిదారులు కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినతులపై ప్రజావాణి సైట్‌లో పూర్తి వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు.

సామాన్యులకు అండగా పోలీసులు

- ఎస్పీ ప్రవీణ్ కుమార్


అర్జీదారు సమస్య తెలుసుకుంటున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: సామాన్యులకు అండగా పోలీసులు ఉండాలని, వారితో స్నేహభావంగా మసులుకోవాలని ఎస్పీ ప్రవీణ్‌కుమార్ పోలీసు అధికారులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఎస్పీ వారి సమస్యలను తెలుసుకుని సంబంధిత పోలీస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. సామాన్యులకు అండగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నాణ్యమైన పోలీసు వ్యవస్థను జిల్లా ప్రజలకు అందించడమే లక్ష్యమన్నారు. పోలీసుల సహాయం కావాలనుకునేవారు ఠాణాలో నిర్భయంగా ఫిర్యాదు చేయాలన్నారు. అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించినా సంఘ వ్యతిరేక చర్యలు జరుగుతున్నాయని తెలిసినా వెంటనే 87126 59599 వాట్సాప్ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలి

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్



మాట్లాడుతున్న బొమ్మెన సురేశ్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రతీ గ్రామానికీ బస్సు సౌకర్యం కల్పించాలని సీఐటీ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం హర్షనీయమన్నారు. కానీ రాష్ట్రంలో సుమారు నాలుగువేల గ్రామాలకు నేటికీ ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో వారు ఈ సౌకర్యాన్ని వినియోగించుకునే అవకాశం లేదన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజనం, గ్రామపంచాయతీ, మున్సిపాలిటీ, ఐకేపీ వీవోఏలు, ఫీల్డ్ అసిస్టెంట్స్, బాసర ట్రిపుల్‌ఐటీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్మికుల కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు లలిత, కోశాధికారి బి.లలిత, జిల్లా కమిటీ సభ్యులు కాల్మెంట్ వెస్లీ, సుగుణ, నంద, సుమన్ బాయి, పిరాజీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్‌చైన్‌గేట్: ప్రధానోపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కేజీబీవీ విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించేందుకు తీసుకుంటున్న చర్యలపై విద్యాశాఖ అధికారులతో సోమవారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు రాగిజావ, బ్రేక్ ఫాస్ట్ అందించాలన్నారు. ఒకటి నుండి 5వ తరగతి విద్యార్థులకు తొలిమెట్టు, 6 నుండి 9వ తరగతికి ఉన్నతి, పదో తరగతి విద్యార్థులకు లక్ష్య అనే ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించి అన్ని పాఠశాలల్లో ప్రవేశపెట్టామన్నారు. డిసెంబర్ 12 నుండి జనవరి 10 వరకు 'అకడమిక్ బబుల్' అనే ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాల విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారా స్కూల్ వివరాలు అప్‌లోడ్ చేయాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్ పాల్గొన్నారు.

కొరిటికల్ పాఠశాలను సందర్శించిన డీఈవో


వివరాలు తెలుసుకుంటున్న డీఈవో రవీందర్‌రెడ్డి

మామడ: మండలంలోని కొరిటికల్ పాఠశాలను సోమవారం జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి సందర్శించారు. శనివారం పాఠశాలలో అల్పాహారం అందించేందుకు వండిన రాగిజావలో పడి గాయపడిన విద్యార్థిని మృతి చెందింది. సంఘటనకు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థిని మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థిని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, ఎంఈఓ ముత్యం, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన


చించాల పాఠశాలలో ఎస్టీయూ ప్రతినిధులు

ముధోల్: మండలంలోని చించాల ప్రభుత్వ పాఠశాలను సోమవారం ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలను పునః ప్రారంభించినందుకు జిల్లా విద్యాధికారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలోఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు రవిజాదవ్, నన్నం రాజేశ్వర్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు టి. రమేశ్, జిల్లా బాధ్యులు రామాగౌడ్, గంగాధర్, రాజశేఖరాచారి, సర్పంచ్ సంగీత మారిబా, కోఆప్షన్ మెంబర్ శివాజీ, ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, పోషకులు పాల్గొన్నారు.

పునరావాసం కొలిక్కి వచ్చేనా?

- తుదిదశకు చేరిన కాలనీ పనులు
- వివాదంలో వ్యవసాయ భూమి
- భూమి అప్పగిస్తేనే ఊర్లు ఖాళీ చేస్తామంటున్న రాంపూర్, మైసంపేట్ వాసులు
- ఆ భూమి తమదేనంటున్న గోండుగూడ వాసులు


భూమికి సంబంధించిన పత్రాలతో గోండుగూడ వాసులు (ఫైల్)

కడెం(ఖానాపూర్): కవ్వాల్ టైగర్‌జోన్‌లోని కోర్ ఏరియాలో పులి మనుగడ కోసం అటవీశాఖ మొదటి దశలో కడెం మండలం ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలోని రాంపూర్, మైసంపేట్ గ్రామాలను ఖాళీ చేయించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. కొత్తమద్దిపడగ సమీపంలో ఇరుగ్రామాల కోసం పునరావాస కాలనీలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు తుదిదశకు చేరాయి. అయితే ఏళ్లుగా ఎదురుచూస్తున్న పోడు భూములు తమకే దక్కాలని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ పంచాయతీలోని గోండుగూడ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ఆదివాసీలు, అటవీశాఖ అధికారులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. వ్యవసాయ భూమి వివాదంలో ఉండడంతో గ్రామాల తరలింపు ప్రక్రియ మరింత జాప్యం జరుగుతోంది.

ఊర్లను ఖాళీ చేయం..

పునరావాస కాలనీలో అన్నిరకాల సౌకర్యాలు కల్పించి వ్యవసాయ భూమి అప్పగించే వరకు ఊర్లను ఖాళీ చేయమని రాంపూర్, మైసంపేట్ వాసులు నిర్ణయం తీసుకున్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ కోర్ ఏరియాలోని కడెం మండలం ఉడుంపూర్ పంచాయతీ పరిధిలోని మైసంపేట్, రాంపూర్ గ్రామాల్లో మొత్తం 142 కుటుంబాలు ఉన్నాయి. ఇందులో 48 కుటుంబాలకు పునరావాసం కింద రూ.15 లక్షల చొప్పున అందించనుండగా మరో 94 కుటుంబాలకు రూ.11 కోట్లతో కొత్త మద్దిపడగ సమీపంలో 5 హెక్టార్ల విస్తీర్ణంలో


కొత్త మద్దిపడగ వద్ద పునరావాస కాలనీ



ఆదివాసీలు, అటవీ అధికారుల మధ్య గొడవ(ఫైల్)

విద్య, వైద్యం, విద్యుత్, తదితర అన్నిరకాల సౌకర్యాలతో డబుల్ బెడ్‌రూం ఇళ్లతో పునరావాస కాలనీ ఏర్పాటు చేస్తున్నారు. నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ పరిధిలోని పెత్తర్పు గ్రామ సమీపంలో 107 హెక్టార్ల వ్యవసాయ భూమిని 94 కుటుంబాలకు పంపిణీ చేయనున్నారు.

అధికారులు, ఆదివాసీల మధ్య లొల్లి

రాంపూర్, మైసంపేట్ వాసులకు కొత్త మద్దిపడగ సమీపంలో కాలనీ ఏర్పాటు చేయగా పునరావాసంలో భాగంగా అందించే వ్యవసాయ భూమి నచ్చన్‌ఎల్లాపూర్ జీపీ పెత్తర్పు సమీపంలో ఉంది. ఏళ్లక్రితం పోడు వ్యవసాయం కోసం తమ గ్రామానికి ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో చెట్లు నరికి కేసుల పాలయ్యామని, ఏళ్లుగా పోడుపట్టాల కోసం ఎదురుచూస్తున్నామని, గతంలో అటవీ అధికారులే పోడు సర్వే నిర్వహించి తమకు పట్టాలివ్వలేదని వాపోతున్నారు. ఇప్పుడు ఉన్నపలంగా రాంపూర్, మైసంపేట్ వాసులకు అప్పగించడం సరికాదని, వారితో పాటుగా తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడ ఆదివాసీలకు, అటవీ అధికారులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఇటీవలే ఆ భూమిలో వేసిన హద్దు రాళ్లను ఆదివాసీలు తొలగించగా అందులో ఆదివాసీలు వేసుకున్న పశువుల పాకకు అటవీశాఖ అధికారులు నిప్పంటించారు.


న్యాయం చేయాలి



గోండుగూడ వాసులు ఏళ్ల క్రితం పోడు వ్యవసాయం కోసం చెట్లు నరికి కేసుల పాలయ్యారు. ఇప్పటికైనా వారికి న్యాయం చేయాలి. వారికి చెందాల్సిన భూములను ఇచ్చి మిగతా భూమిని పునరావాస గ్రామస్తులకు పంపిణీ చేయాలి. లేనిపక్షంలో ఆందోళనలు చేస్తాం.

– ఆత్రం రాజేశ్వర్, రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు


మూడెకరాలైనా ఇవ్వాలి



మొదట పునరావాసం కింద తమకు ఐదెకరాల వ్యవసాయ భూమి ఇస్తామని అటవీ అధికారులు తెలిపారు. ఇప్పుడు రెండెకరాల 32 గుంటలు మాత్రమే ఇస్తామంటున్నారు. కనీసం మూడెకరాలైనా ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– ప్రవీణ్, మైసంపేట్


ఖాళీ చేయం



పునరావాస కాలనీలో అన్నిరకాల ఏర్పాట్లు చేసేవరకు, వ్యవసాయ భూమి అప్పగించే దాక ఊర్లను ఖాళీ చేయం. పునరావాసం పేరిట ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం. అన్నిరకాల వసతులు పూర్తి కాకుండా ఊర్లు ఖాళీ చేస్తే మా బతుకులు ఆగమవుతాయి.

– బుచ్చవ్వ, రాంపూర్

తుదిదశకు పనులు



రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు, రోడ్లు, డ్రెయినేజీలు పూర్తయ్యాయి. వ్యవసాయ భూమి సర్వే చేయాల్సి ఉంది. లబ్ధిదారులకు గతంలోనే పట్టాలిచ్చాం. ఆభూములు తమకివ్వాలని గోండుగూడ వాసులు వస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్, అటవీ అధికారులు మాట్లాడారు.

– చోలే అనిత, ఎఫ్ఆర్వో, కడెం

క్లుప్తంగా

ఒకరి రిమాండ్

కుంటాల: చోరీకి పాల్పడిన ఒకరిని సోమవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం. అంబకంటిలోని సంతోష్‌కు చెందిన హార్వెస్టర్ గ్యారేజ్ నుంచి ఈనెల 15న రాత్రి వెంకూరు గ్రామానికి చెందిన శీలం రవి రూ. 10వేల విలువగల జాక్, ఇనుపరాడ్ దొంగిలించాడు. యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా సోమవారం కొత్త వెంకూర్ బస్టాండ్ సమీపంలో రవి దొంగిలించిన వస్తువులను అమ్మేందుకు వెళ్తుండగా పట్టుకున్నారు. నిందితుడిని భైంసా మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్సైఅన్నారు.

గురుకులం పిలుస్తోంది..

- ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ
- ప్రారంభమైన ఆన్‌లైన్ ప్రక్రియ
- ప్రవేశ పరీక్షలో మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక
- ఎస్సీ, బీసీ, జనరల్ గురుకులాల్లో ప్రవేశం



బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయం

బెల్లంపల్లి: ప్రభుత్వ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో ఐదో తరగతిలో ప్రవేశానికి (వీటీజీ సెట్ -24) రంగం సిద్ధమైంది. ఈ మేరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈ ఐఎస్) కార్యదర్శి, చీఫ్ కన్వీనర్ ఇ.నవీన్ నికోలస్ నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలలను ఆయా సంక్షేమ శాఖల ద్వారా గురుకులాలను నిర్వహిస్తున్నారు. ఆంగ్ల మాధ్యమం ద్వారా బోధన చేస్తూ విద్యార్థుల్లో అంతర్లీనంగా దాగి ఉన్న సహజసిద్ధమైన నైపుణ్యాలను వెలికితీయడానికి గురుకుల విద్యాలయాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. దీంతో ఆయా గురుకుల విద్యాలయాల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి ఏటా విద్యార్థుల మధ్య తీవ్రమైన పోటీ ఉంటోంది. ప్రవేశపరీక్షలో మెరిట్ మార్కుల ప్రాతిపదికన ప్రతిభావంతులైన విద్యార్థులను ఎంపిక చేసి సీటు కేటాయిస్తారు. ప్రభుత్వ గురుకులాల్లో సీటు సాధించిన విద్యార్థులకు భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారు.

జనవరి 6 వరకు గడువు..

నిర్మల్ జిల్లాలో మొత్తం గురుకులాలు 19 ఉండగా.. ఐదో తరగతిలో ప్రవేశం కోసం 2024 ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష జరుగనుంది. ఎంపిక చేసిన కేంద్రాలలో ఉదయం 11గంటలకు పరీక్ష ప్రారంభమై మధ్యాహ్నం 1గంటకు ముగుస్తుంది. ప్రవేశ పరీక్ష రాయడానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నెల 18న ప్రారంభమైన ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ 2024 జనవరి 6వ తేదీ వరకు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. రుసుము రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఫోన్ నెంబర్‌తో ఒక దరఖాస్తు మాత్రమే చేసుకోవాల్సి ఉంటుంది.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ప్రభుత్వ గురుకులాలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ప్రైవేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోకుండా అన్ని ప్రమాణాలతో బోధన చేసి విద్యార్థులను అన్ని విధాలా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతోంది. ప్రత్యేకించి విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆటలపై ఆసక్తి, ధ్యానం ఇతర అన్ని విధాల విద్యార్థుల ఆసక్తికి అనుగుణంగా ప్రోత్సాహకాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వ గురుకులాల్లో సీటు రావడం వరంగా విద్యార్థులు గుర్తించాలి.

– ఐనాల సైదులు, ప్రిన్సిపాల్, సంక్షేమ గురుకుల విద్యాలయం, బెల్లంపల్లి

దరఖాస్తు దారులకు సూచనలు :

- 2023-24 విద్యాసంవత్సరంలో నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు.
- ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4వ తరగతి చదువుతున్నట్లుగా సంబంధిత పాఠశాల నుంచి బోనఫైడ్ /స్టడీ సర్టిఫికేట్‌ను దరఖాస్తుతో పాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి.
- ఓ అభ్యర్థికి బదులు మరో అభ్యర్థి ఫొటో పెట్టి దరఖాస్తు చేయరాదు. ఎవరైనా ఆ తీరుగా వ్యవహరిస్తే క్రిమినల్ చర్యలకు బాధ్యులవుతారు.
- విద్యార్థుల ఎంపికకు ఉమ్మడి జిల్లా యూనిట్‌గా పరిగణిస్తారు.
- ఇతర సమాచారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 1800 42545678ను ఉదయం 10-30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించవచ్చు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిని చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. దహెగాం మండలం ఇటీక్యాల గ్రామానికి చెందిన బుర్రి నానయ్య తనకు విద్యుత్ బోర్ బావి మంజూరు చేయాలని, ఉట్నూర్ గ్రామానికి చెందిన బాలేపు రాములు ఆసరా పెన్షన్ ఇప్పించాలని కోరారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఊర్వేత నవీన గురుకుల కళాశాలలో సీఆర్టీ ఉద్యోగం ఇప్పించాలని, బజార్‌హత్నూర్ మండలం రత్నగూడ గ్రామానికి చెందిన కుంరం మాధవ్ అటవీ హక్కు పత్రాలు మంజూరు చేయాలని కోరారు. పింఛన్, రెండు పడకల గదుల ఇండ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రజావాణిలో డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీ ఎంహెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, ఆర్‌సీవో గంగాధర్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీఓ ప్రవీణ్, ఐటీడీఏ మేనేజర్ లింగు పాల్గొన్నారు.

బోథ్: మండలంలోని పట్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సుర్దాపూర్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్తులు సోమవారం ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయి, డీడీ దిలీప్‌లకు వినతిపత్రం అందించారు. గ్రామానికి రోడ్డు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది పంద్రం శంకర్, చైతన్య యూత్ అధ్యక్షుడు తొడసం విజయ్ కుమార్, ఆడెం శ్రీనివాస్, ఇస్తారి, కృష్ణ, పరశురాం ఉన్నారు.

ఏసీబీ వలలో లేబర్ ఆఫీసర్

- రూ.25వేలు లంచం తీసుకుంటుండగా పట్టివేత
- సహకరించిన కుమారుడు దామోదర్
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న అధికారులు


లేబర్ ఆఫీసర్ నివాసంలో ఏసీబీ అధికారులతో నిందితుడు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని సహాయక కార్మిక శాఖ అధికారి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి వివరాల ప్రకారం.. కడెం మండలం పెద్ద బెల్లాలు గ్రామానికి చెందిన గంగన్న తల్లి రిజిస్టర్డ్ లేబర్ చనిపోయింది. తల్లికి అందాల్సిన పరిహారం రూ.లక్షా 30వేల కోసం వారం కిందట కార్మికశాఖ కార్యాలయానికి వెళ్లాడు. ఫైల్‌పై సంతకానికి సాయిబాబా రూ.30వేలు డిమాండ్ చేయగా రూ.25వేలకు ఒప్పందం కుదిరింది. దీంతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లోని కార్మికశాఖ అధికారి ఇంటి వద్ద తన కొడుకు దామోదర్‌కు రూ.25వేలు ఇస్తుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తండ్రీ కొడుకులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. కరీంనగర్‌లోని సెంట్రల్ జైలుకు తరలిస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెల్లడించాడు.


స్వాధీనం చేసుకున్న నగదు

పంట చేనులో మేసిందని కొట్టినందుకే...

ఖానాపూర్: దున్నపోతు దాడిలో ఆదివారం పశువుల కాపరి మృతిచెందినట్లు ఎస్సై రజినీకాంత్ సోమవారం తెలిపారు. విచారణలో భాగంగా ఎస్సై మండలంలోని రాజురా గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఆయన వివరాల ప్రకారం... పశువులను తీసుకుని కాపరి గంగన్న గ్రామ శివారుకు వెళ్లాడు. ఈ క్రమంలో దున్నపోతు పంట చేనులో మేయడంతో పశువుల కాపరి దానిని కొట్టాడు. దీంతో దున్నపోతు దాడిచేయగా గంగన్న మృతిచెందాడు. మృతుడి భార్య ఆశవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు. పలువురిపై పదేపదే దాడికి పాల్పడడంతో పాటు ఒకరి మృతికి కారణమైన విత్తనపోతును విక్రయించేందుకు గ్రామస్తులు పూనుకుంటున్నారు.

తల్లి మందలించిందని యువతి ఆత్మహత్య

దస్తురాబాద్: తల్లి మందలించిందని యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం మండలంలోని దేవునిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రభాకర్‌రెడ్డి వివరాల ప్రకారం.. మండలంలోని దేవునిగూడెం గ్రామానికి చెందిన పానుగంటి గంగవ్వ-పోషన్నలకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు. తండ్రి గతంలో మృతిచెందడంతో తల్లి గంగవ్వనే కుటుంబాన్ని పోషిస్తుంది. ఇటీవల పెద్ద కూతురు సాత్విక(22) పెళ్లి కుదిరింది. గత కొద్ది రోజులగా తరుచుగా ఫోన్‌లో మాట్లాడుతుండడంతో తల్లి ఆదివారం మందలించింది. దీంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగింది. కుటుంబీకులు వెంటనే నిర్మల్‌లోని ప్రైవేట్‌ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. మృతదేహన్ని ఖానాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ముథోల్: మండల కేంద్రమైన ముథోల్‌లో శనివారం బాసర-భైంసా రహదారిపై గుర్తు తెలియని వ్యక్తి మృతి (40) చెందినట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు. సోమవారం ఉదయం అనారోగ్యంతో బాధపడుతున్న గుర్తు తెలియని వ్యక్తిని గమినించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించి 108లో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మామడ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని ఆరేపల్లి గ్రామ సమీపంలో బజార్‌హత్నూర్ గ్రామానికి చెందిన బుర్కె రవీందర్(26)రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా అడవి జంతువులు అడ్డురావడంతో కిందపడగా తీవ్రంగా గాయపడి మృతిచెందాడు.

గుండెపోటుతో భీంపూర్ తహసీల్దార్ మృతి


నారాయణ(ఫైల్)

తాంసి: ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న జె.నారాయణ(54) సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా నిర్మల్ జిల్లా నుంచి ఆదిలాబాద్ జిల్లాకు బదిలీపై వచ్చిన ఆయన ఆగస్టు 4న భీంపూర్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. నాలుగు నెలలుగా ఆదిలాబాద్ నుంచి విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో కుటుంబసభ్యులను కలిసేందుకు నిర్మల్ వెళ్లాడు. రాత్రి ఒక్కసారిగా ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు నిజామాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. వైద్యులు గుండెపోటుగా నిర్ధారించి ఆపరేషన్ చేశారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. తహసీల్దార్ మృతిపై కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో పాటు పలువురు అధికారులు, ప్రజలు సంతాపం తెలిపారు.

అనంతపేటలో విషాదఛాయలు

నిర్మల్‌రూరల్: తహసీల్దార్ నారాయణ స్వగ్రామమైన నిర్మల్‌రూరల్ మండలంలోని అనంతపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. నారాయణకు కుమారుడు, ముగ్గురు కూతుళ్లు సంతానం. గతంలో నిర్మల్‌అర్బన్, నిర్మల్‌రూరల్, లక్ష్మణచాంద, బాసర తహసీల్దార్‌గా పనిచేశారు. ఈ క్రమంలో నిర్మల్‌లోని శ్రీనగర్ కాలనీలో నివాసమున్నారు. ఎన్నికల సమయంలో భీంపూర్‌కు బదిలీ అయ్యారు. నారాయణ మృతితో ఆయా గ్రామాల్లో విషాదచాయలు అమ్ముకున్నాయి. మంగళవారం అనంతపేటలో అంత్యక్రియలు జరగనున్నాయి.

నూతన నియామకం

సోన్: తెలంగాణ జూనియర్ గెజిటెడ్ లెక్చరర్ల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఎన్నికల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన చొక్కాల రాజేందర్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. మండలంలోని బొప్పారం గ్రామానికి చెందిన రాజేందర్ గుడిహత్నూర్ ప్రభుత్వ కళాశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు.

కోతిదేవుడి జాతరకు ముస్తాబు


ధర్మారంలోని కోతిదేవుడి ఆలయం

- 19న రథోత్సవంతో జాతరకు అంకురార్పణ
- 20న నిండు జాతర
- తరలిరానున్న వేలాది భక్తులు

లక్ష్మణచాంద: ఒక కోతి మరణిస్తే దానికి గ్రామస్తులులంతా ఒకే తాటిపైకి వచ్చి సమాధి నిర్మించారు. ఆ తరువాత మండలంలోని ధర్మారం -పీచర గ్రామాల మధ్యన ఆలయం నిర్మించి పూజలు చేయడం ప్రారంభించారు. భక్తుల కోరికలు నెరవేరడంతో ఆలయానికి రద్దీ పెరిగింది. దీంతో ఏటా రెండు రోజుల పాటు జాతర నిర్వహించడం ఆనవాయితీగా మారింది.

కోతిదేవుడి ఆలయ చరిత్ర...

1976లో నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం గ్రామంలోకి ఒక కోతి వచ్చింది. అది ప్రజలతో మధ్యన మమేకమై ప్రజలతో కలిసి మెలిసి ఉండేది. గ్రామంలోని రైతులకు ఆ కోతితో విడదీయని అవినాభావ సంబంధం ఏర్పడింది. ఆ విధంగా రెండు సంవత్సరాలు ఆ కోతి ప్రజలతోనే కలిసి జీవనం కొనసాగింది. ఆ తరువాత ఆ కోతి ప్రవర్తనలో మార్పు వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడంతో పాటు ప్రజల మీదకు వచ్చి వారిని కరుస్తూ వారి పంటలను నాశనం చేయడం ప్రారంభించింది. ఈ క్రమంలో ధర్మారం గ్రామస్తులు ఆ కోతిని ఊరి బయటకు తరిమి వేశారు. కానీ ఆ కోతి మళ్లీ గ్రామంలోకి రావడంతో భయపడిన గ్రామస్తులు దానిని చంపి ఊరి బయట సమాధి చేశారు.


పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గ్రామస్తుల కలలోకి వచ్చి...

కోతిని చంపివేయడంతో గ్రామంలో కొంతవెలతి కనిపించింది. ఓ వ్యక్తి కలలోకి వచ్చి తాను మారుతి రూపంలో వచ్చిన ఆంజనేయ స్వామిని అని చెప్పడంతో ఆ వ్యక్తి మరుసటి రోజు ఉదయం గ్రామంలోని పెద్దలతో సమావేశం ఏర్పాటు చేశాడు. గ్రామస్తులందరూ కలిసి ఆ కోతికి ఒక సమాధిని నిర్మించి నిత్యం పూజలు చేయడం ప్రారంభించారు. దీంతో చుట్టు పక్కల గ్రామాల వారు కూడా అక్కడికి వచ్చి పూజలు చేయడంతో ఒక్కసారిగా కోతిదేవుడి పేరు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా వ్యాపించింది.

ప్రతీ సంవత్సరం డిసెంబర్‌లో జాతర...

ప్రతీ సంవత్సరం డిసెంబరు 19, 20 తేదీలలో గ్రామస్తులు ఘనంగా జాతరను నిర్వహిస్తారు. ఈ జాతరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నుంచే కాకుండా మహారాష్ట్ర వంటి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యల వస్తారు. జిల్లా ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులను సైతం ఏర్పాటు చేయనుంది. ఎస్సై శ్రీకాంత్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.

మహిమ గల కోతి దేవుడు



మండలంలోని ధర్మారం గ్రామంలోని కోతిదేవుడు చాలా మహిమ గల దేవుడని భక్తుల కోరిన కోర్కెలు తీర్చుదేవుడు. ఇక్కడకు వచ్చి కోతిదేవుడిని పూజించిన భక్తుల కోరికలు తప్పక నెరవేరుతాయని ఇక్కడి ప్రజల, భక్తులు నమ్మకం.

– సుమన్, ఆలయ కమిటీ సభ్యుడు

జాతరకు సర్వం సిద్ధం



ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే మహా కోతిదేవుడి జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గ్రామ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశాం. అక్కడికి వచ్చే భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. 19న రథోత్సవంతో జాతరకు అంకుర్పాణ చేస్తాం. 20వ తేదీన జాతరకు వచ్చే భక్తులందరికీ అన్నదానం ఉంటుంది.

– రాజేందర్‌రెడ్డి, సర్పంచ్, ధర్మారం

పోలీస్ జాగీలం ‘జూలీ’ మృతి

- పోలీస్ లాంఛనాలతో అంత్యక్రియలు
- నివాళులర్పించిన ఎస్పీ ప్రవీణ్ కుమార్


జూలీ పార్థివదేహానికి సెల్యూట్ చేస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లా పోలీస్‌శాఖకు విశేష సేవలందించిన ‘జూలీ’ అనే జాగిలం అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. 2018 నుంచి ‘జూలీ’ పలు నేర కేసుల్లో కీలక పాత్ర పోషించింది. జాగిలం మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు పోలీసు అధికారులు, సిబ్బంది మౌనం పాటించారు. లాబ్ జాతికి చెందిన జాగిలం ‘జూలీ’ 14 అక్టోబర్ 2016న జన్మించింది. రంగారెడ్డి జిల్లాలోని కెనైన్ ట్రైనింగ్ సెంటర్ ఐబీపీఏ మొయినాబాద్‌లో ఎనిమిది నెలల శిక్షణ పూర్తి చేసుకుంది. శిక్షణ సమయంలో అత్యుత్తమ ప్రతిభ కనబరచి, నిర్మల్ జిల్లా పోలీస్‌శాఖలో ఫిబ్రవరి 25, 2018 నుంచి నేర విభాగంలో వీవీఐపీ బందోబస్తులో విధులు నిర్వర్తిస్తూ.. పలు హత్య, దొంగతనాల కేసులను ఛేదించడంలో ప్రతిభ కనబరిచింది. విధి నిర్వహణలో మాత్రమే కాకుండా పలు జాతీయస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొని ప్రతిభ చాటింది. ‘జూలీ’కి పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ‘జూలీ’ పార్థివదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి ఎస్పీ సీహెచ్ ప్రవీణ్‌కుమార్ నివాళులర్పించారు. జిల్లా పోలీస్‌శాఖకు ‘జూలీ’ సేవలు వెలకట్టలేనివని ఎస్పీ కొనియాడారు. ఇందులో ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్ఐలు రాంనిరంజన్, రమేష్, రామకృష్ణ ఉన్నారు.

ఘనంగా దత్త జయంతి


సాయిబాబాకు హారతి నిస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరులో రెండోషిర్డీగా ప్రసిద్ధిగాంచిన శ్రీదత్త వెంకట సాయిబాబా ఆలయంలో సోమవారం ఘనంగా దత్త జయంతి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం శ్రీ విఘ్నేశ్వర పూజ, శ్రీ దత్త వెంకట సాయి దేవతల పూర్ణాభిషేక పూజలు, కలశ స్థాపన, శ్రీ గురు చరిత్ర, సాయి సత్ చరిత్ర, శ్రీ గజానన్ విజయం, శ్రీపాద వల్లభ చరితం చరితామృతం, సప్తహ పారాయణములు కార్యక్రమాలు నిర్వహించారు.